రాజ్యాంగం.. ప్రాథమిక హక్కులు

ప్రాథమిక హక్కులను రాజ్యాంగంలోని మూడో భాగంలో పొందుపరిచారు. ఈ హక్కుల ప్రధాన లక్ష్యం 'వ్యక్తి స్వేచ్ఛ'. ప్రాథమిక హక్కులతో పాటు ఆదేశసూత్రాలు కూడా హక్కులే.ప్రాథమిక హక్కులు వ్యక్తి శ్రేయస్సుకు ప్రాధాన్యతనిస్తే, ఆదేశసూత్రాలు సామాజిక సంక్షేమానికి పెద్ద పీట వేస్తాయి.



మానవచరిత్ర ప్రారంభమైనప్పటి నుంచి మనిషికి,రాజ్యానికి మధ్య ఘర్షణ కొనసాగుతూనే ఉంది. ఈ రెండింటి మధ్య సామరస్యాన్ని సాధించడానికి అనేక ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో అది మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఒకవైపు మానవ స్వేచ్ఛను పరిరక్షిస్తూనే, మరోవైపు రాజ్యసమగ్రతను కాపాడవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ రెండింటి మధ్య సమతౌల్యాన్ని సాధించడానికి తోడ్పడేవే ప్రాథమిక హక్కులు. 'సామాజిక ఆమోదం, చట్టబద్ధత కలిగి సంఘంలోని వ్యక్తులందరూ అనుభవించే సదుపాయాలే' హక్కులు. ఇవి మానవ మనుగడకు ఎంతో అవసరమైనవి. అందుకే వీటిని ప్రాథమిక హక్కులు అంటారు. ఆధునిక రాజ్యాంగాలన్నీ వీటి గురించి ప్రస్తావిస్తాయి. బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా లాంటి దేశాల్లోమాత్రమే చట్టబద్ధమైన ప్రాథమిక హక్కులు లేవు.

అంతమాత్రాన ఆ దేశాల ప్రజలు హక్కులు అనుభవించడం లేదని కాదు. వాస్తవానికి బ్రిటిష్ ప్రజలు అనుభవించినంత స్వేచ్ఛ మరే ఇతర దేశాల ప్రజలు అనుభవించడం లేదంటే.. అది అతిశయోక్తి కాదేమో. మన రాజ్యాంగకర్తలు అమెరికా, ఐరిష్ రాజ్యాంగాలను నమూనాగా తీసికొని రాజ్యాంగంలోని మూడవ భాగంలో పొందుపరిచారు. ఫ్రాన్స్ మానవహక్కుల ప్రకటన, ఐక్యరాజ్యసమితి ఆమోదించిన మానవహక్కుల చార్టరు కూడా మన రాజ్యాంగకర్తలను ప్రభావితం చేసింది.

ప్రాథమిక హక్కుల ప్రధాన లక్ష్యం :

రాజ్య నిరపేక్ష అధికారం నుంచి వ్యక్తి స్వేచ్ఛను పరిరక్షించుట. శాసన, కార్యనిర్వాహక శాఖలు తమ విధుల నిర్వహణలో వ్యక్తి స్వేచ్ఛను హరించకుండా న్యాయశాఖ కాపాడుతుంది. అలాగే సమాజంలోని శక్తివంతమైన వ్యవస్థలు, వ్యక్తులు తమ ఆధిపత్యాన్ని సామాన్య ప్రజానీకం మీద చెలాయించడాన్ని నిరోధించే చట్టబద్ధమైన హామీలే ఈ ప్రాథమిక హక్కులు. ప్రాథమిక హక్కులతోపాటు, ఆదేశసూత్రాలు (రాజ్యాంగంలోని నాలుగో భాగం) కూడా హక్కులే. ప్రాథమిక హక్కులు వ్యక్తి శ్రేయస్సుకు ప్రాధాన్యతనిస్తే, ఆదేశసూత్రాలు సామాజిక సంక్షేమానికి పెద్ద పీట వేస్తాయి.

12 వ ప్రకరణ నుంచి 35 వరకు ప్రాథమిక హక్కుల గురించి వివరించారు. 12వ ప్రకరణ రాజ్యాన్ని నిర్వచిస్తూ, కేంద్ర, రాష్ట్ర శాసన, కార్యనిర్వాహక విభాగాలు, స్థానిక ప్రభుత్వాలు చెలాయించే అధికారం, హక్కులకు భంగం కలగకూడదు అని పేర్కొంటుంది. 13 వ ప్రకరణ (2వ క్లాజు) ప్రకారం రాజ్యం ప్రాథమిక హక్కులను తొలగించే లేదా పరిమితం చేసే చట్టాలను చేయకూడదు.

అయితే 13(4) ప్రకారం, 368వ ప్రకరణ కింద రూపొందించిన రాజ్యాంగ సవరణ.. ప్రాథమిక హక్కులను సవరించడానికి, తొలగించడానికి అనుమతినిస్తుంది(24వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం). 33వ ప్రకరణ సాయుధ బలగాలకు సంబంధించి ప్రాథమిక హక్కులను పరిమితం చేస్తూ చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకు కల్పిస్తుంది. అలాగే సైనికచట్టం అమల్లో ఉన్న ప్రాంతాల్లో ప్రాథమిక హక్కులను పరిమితం చేస్తూ చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకు 34వ ప్రకరణ కింద లభించింది. 35వ ప్రకరణ కింద పార్లమెంటుకు మాత్రమే 16(3), 32(3), 33, 34 ప్రకరణల్లో ప్రస్తావించిన అంశాల మీద చట్టాలు చేసే అధికారాన్నిస్తుంది. రాష్ట్ర శాసనసభలకు ఆ అధికారం లేదు.